క్లుప్తంగా

హసీనాకు డాక్టరేట్



తిరుపతి సిటీ: ఎస్వీయూ గణిత విభాగపు పరిశోధక విద్యార్థిని షేక్ హసీనాకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆమె ప్రొఫెసర్ సి.జయసుబ్బారెడ్డి పర్యవేక్షణలో సమ్ స్టడీస్ ఆన్ రివర్స్ డైరెక్షన్ ఇన్ రింగ్స్ అనే అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా జనార్దన్ నాయుడు



ప్రమాణ స్వీకారం చేస్తున్న జనార్ధన్ నాయుడు

రామచంద్రాపురం: బీజేపీ మండల అధ్యక్షుడిగా ఎస్ఆర్ కమ్మపల్లికి చెందిన జనార్దన్ నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం రాయలచెరువు సమీపంలోని రాయల మండపంలో జిల్లా కార్యదర్శి హరినాథ్ ఆధ్వర్యంలో బీజేపీ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

బియ్యం వితరణ



పారిశుద్ధ్య కార్మికులకు బియ్యం బస్తాలను అందిస్తున్న రణధీరపురం ఉప సర్పంచ్ ఉమాపతి

తిరుపతి మంగళం: రణధీరపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులకు ఆ గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ మల్లెమొగ్గల ఉమాపతి బియ్యం సాయం చేశారు. ఆదివారం ఆయన ఒక్కో పారిశుద్ధ్య కార్మికుడికి 25 కేజీల బియ్యం బస్తా అందించారు. చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి స్ఫూర్తితో క్రిస్మస్, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కార్మికులకు బియ్యం సాయం చేసినట్లు ఉప సర్పంచ్ వెల్లడించారు.

చిరు వ్యాపారుల దీక్షకు మద్దతు



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న సీపీఎం నాయకుడు మధు

తిరుపతి సిటీ: శ్రీవారిమెట్టు చిరువ్యాపారుల పోరాటం న్యాయమైందని, సీఎం చంద్రబాబు తక్షణమే సమస్యను పరిష్కరించడానికి కృషి చేయాలని సీపీఎం మాజీ రాజ్యసభ సభ్యులు పెనుమల్లి మధు డిమాండు చేశారు. టీటీడీ ఏడీ బిల్డింగ్ వద్ద చిరు వ్యాపారుల చేస్తున్న దీక్షలు 132వ రోజుకు చేరుకోవడంతో ఆయన వారికి మద్దతు పలికి సంఘీభావం తెలిపారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ చిరువ్యాపారులకు న్యాయం చేయాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు టీటీడీ చైర్మన్, ఈఓ, ఏఈఓల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిరువ్యాపారులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమ జీవితాలు ఎంతో ఆనందంగా ఉంటాయని భావిస్తే.. తమకు నిరాశే ఎదురైందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరగని పక్షంలో పెద్దఎత్తున పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, శ్రీవారిమెట్టు చిరు వ్యాపారస్తుల సంఘం నేతలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్పోర్ట్స్ మీట్



బహుమతి ప్రదానం చేస్తున్న మోహన్

వరదయ్యపాళెం : కేంద్ర యువజన మంత్రిత్వ శాఖ, చిత్తూరుకు చెందిన నెహ్రూ యువ కేంద్రం, స్వచ్ఛత్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం ఆదివారం వరదయ్యపాళెంలోని జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉత్సాహంగా సాగింది. మండల వ్యాప్తంగా వివిధ క్రీడలకు సంబంధించి 32 జట్లు పాల్గొనగా స్వచ్ఛత్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ అధ్యక్షుడు మావుడూరు మోహన్ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కబడ్డీ, వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. వాలీబాల్ విభాగానికి సంబంధించి చిలమత్తూరుకు చెందిన కెప్టెన్ ఎబినేచర్ పాల్ జట్టు మొదటి స్థానం సాధించింది. అలాగే కబడ్డీ పోటీల్లో వరదయ్యపాళెం దళితవాడకు చెందిన కెప్టెన్ రాజేష్ జట్టు ప్రథమ స్థానం సాధించింది. వీరికి సంస్థ అధ్యక్షుడు మావుడూరు మోహన్ రూ.5 వేల చొప్పున మొదటి బహుమతిని అందజేశారు. వరదయ్యపాళెం, సంతవేలూరు హైస్కూళ్లకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు బందిలకుమార్, మనోహర్ క్రీడా పోటీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆణిముత్యంరెడ్డి, బీజేపీ నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయులు రామసుబ్బయ్య పాల్గొన్నారు.

మేడం వస్తారు.. కానీ ఎప్పుడో !

నియోజకవర్గంలో చంద్రగిరి తర్వాత అత్యంత ప్రాధాన్యత గల పంచాయతీ తిరుచానూరు. ఒక మండలానికి సమానమైన జనాభా, 26వేలకు పైగా ఓటర్లు, 20 వార్డులు, 05 సచివాలయాలు అంతకుమించి శ్రీపద్మావతి అమ్మవారి ఆలయం ఇందులోనే ఉన్నాయి. ఇంత ప్రాముఖ్యత ఉన్న పంచాయతీపై ప్రభుత్వ పెద్దలు శీతకన్ను వేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇక్కడ పంచాయతీ ఈఓ పోస్టును ఇన్‌చార్జ్‌తోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఫలితంగా పంచాయతీ పాలన అస్తవ్యస్తంగా మారింది.

- కనిపించని ఇన్‌చార్జ్ ఈఓ
- ఎప్పుడొస్తారో తెలియని పరిస్థితి
- పంచాయతీలో పేరుకుపోతున్న సమస్యలు
- అయినా ఇన్‌చార్జ్ పాలనకే కూటమి మొగ్గు
- రెగ్యులర్ ఈఓ నియామకంలో మీనమేషాలు



పంచాయతీ ఈఓ లేకపోయినప్పటికీ లైట్లు, ఫ్యాన్లు వెలుగుతూ ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీ



వసుంధర నగర్‌లో ఇళ్ల మధ్యే దర్శనమిస్తున్న చెత్తాచెదారం

చంద్రగిరి: తిరుచానూరు పంచాయతీలో పాలన గాడి తప్పడంతో ఎక్కడి సమస్యలు అక్కడే నిలిచిపోయాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. పంచాయతీ పరిధిలో శ్రీపద్మావతి అమ్మవారి ఆలయం ఉండడంతో నిత్యం వేలాది మంది భక్తులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆలయ పరిధిలో టీటీడీ అధికారులు పారిశుద్ధ్యం మెరుగు పరుస్తున్నారు. అయితే ఆ తర్వాత చర్యలు చేపట్టాల్సిన పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా భక్తులు, ప్రజలు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి. వీధి కుక్కలు, పందులు గుంపులు గుంపులుగా తిరుగుతూ భక్తులు, స్థానిక ప్రజలపై దాడికి దిగుతున్నాయని ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదంటూ మండిపడుతున్నారు. దీనికి తోడు రెండు రోజులకు ఓసారి తాగునీటిని వదలడంతో ఇబ్బందులు పడుతున్నట్లు పంచాయతీ ప్రజలు ఆవేదన వ్యక్తం చెందుతున్నారు. కనీసం ఫోన్ చేసినా స్పందన లేదని ఆరోపిస్తున్నారు. తిరుచానూరు పంచాయతీపై ప్రభుత్వం శీతకన్ను వేయడంపై స్థానికులు మండిపడుతున్నారు.

కార్యాలయంలో కానరాని అధికారి

తిరుచానూరు పంచాయతీకి తిరుపతి రూరల్ మండలం ఈఓపీఆర్డీ మాధురిని ఇన్‌చార్జ్ ఈఓగా నియమించారు. ఆమె కార్యాలయానికి మొక్కుబడిగా వచ్చి వెళ్తున్నారంటూ స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. మేడమ్ ఎప్పుడొస్తారు.. ? ఎప్పుడు వెళ్తారో తెలియడం లేదంటూ ప్రజలు వాపోతున్నారు. బర్త్, డెత్ సర్టిఫికెట్ల మంజూరు, విద్యుత్ మీటర్ల కనెక్షన్, ఎన్‌ఓసీలు, ఇంటికి పన్ను అనుమతులు, పంచాయతీ అనుమతి ఇలా అనేక రకాల సేవలను పొందడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్‌చార్జ్ అధికారి ఏర్పాటు చేయడం ద్వారా సకాలంలో అనుమతులు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. మండల అధికారిని ఇన్‌చార్జ్‌గా నియమించడంతో స్థానిక సమస్యలపై దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఈ తరహా పాలన చూడలేదని, పంచాయతీ పరిధిలో ఉన్న జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని రెగ్యులర్ పంచాయతీ ఈఓను నియమించాలంటూ ప్రజలు కోరుతున్నారు.

త్వరలో నియమిస్తాం

తిరుచానూరు పంచాయతీకి రెగ్యులర్ ఈఓను నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇక్కడ పని పనిచేయడానికి గ్రేడ్-1 అధికారి అవసరం. ఆ మేరకు త్వరలోనే రెగ్యులర్ ఉద్యోగిని ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

- కె.రామచంద్ర, ఎంపీడీఓ, తిరుపతి రూరల్ మండలం

అమ్మవారి సేవలో ప్రముఖులు



అమ్మవారి ఆలయం వెలుపల కేంద్రమంత్రి ప్రతాప్ రావు జాదవ్

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని ఆదివారం సాయంత్రం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కేంద్ర ఆయుష్, వైద్య ఆరోగ్య సహాయ మంత్రి ప్రతాప్ రావు జాదవ్, మాజీ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ కుటుంబ సభ్యులతో వేర్వేరుగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న వారికి ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, సూపరింటెండెంట్ రమేష్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

రమాదేవి ఆస్పత్రిలో ఉచిత ఈఎన్‌టీ కన్సల్టేషన్

తిరుపతి తుడా: స్థానిక రమాదేవి ఆస్పత్రిలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు, పోలీసులకు, టీటీడీ ఉద్యోగులకు, ఏపీఎస్‌పీడీసీఎల్, ఎస్పీఎఫ్, ఆబ్కారీ శాఖ, ఎక్స్ ఆర్మీ ఉద్యోగులకు ఉచితంగా కంటి డాక్టర్‌ను కలిసేందుకు అవకాశం కల్పించినట్లు ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ డీబీ శశిధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు డాక్టర్‌ను కలవొచ్చన్నారు. ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తమన్నారు. వివరాలకు 9849677970 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పవన్ కల్యాణ్ తీరూ కారణమే !



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు పెనుమల్లి మధు

తిరుపతి కల్చరల్: తిరుపతి నగరంలో గత కొన్నాళ్లుగా సాగుతున్న మతోన్మాద శక్తుల ఆగడాలను అరికట్టాలని, ఈ ఆగడాలు పెరగడానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యవహరిస్తున్న తీరు కూడా ఓ కారణమని సీపీఎం రాష్ట్ర నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు పెనుమల్లి మధు అన్నారు. రాష్ట్రంలో దళిత, ఆదివాసీలపై మతోన్మాద శక్తుల దాడులను ఖండిస్తూ రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ పి.అంజయ్య ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్ భవన్‌లో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. దేశంలో, రాష్ట్రంలో బీజేపీ ఆగడాలు మితిమీరిపోవడానికి కారణం వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ వంటి మతోన్మాద శక్తులే అన్నారు. ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న తిరుపతి నగరంలో కుట్రపూరితంగా జరుగుతున్న ఘర్షణలను నివారించడానికి ప్రజాస్వామ్యవాదులు, శాంతి కాముకులు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నేత ఈశ్వరయ్య, పౌరహక్కుల సంఘం రాష్ట్ర నేత క్రాంతిచైతన్య, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి, వివిధ సంఘాల నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

న్యాయవాది మృతిపై నిరసన

తిరుపతి లీగల్: అనంతపురం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో సీనియర్ న్యాయవాది బీవీ శేషాద్రి వేధింపులతో హతాన్మరణాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులు అసోసియేషన్ అధ్యక్షుడు ఊటుపల్లి లక్ష్మన్న తెలిపారు. సివిల్ కేసులో త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పోలీస్ అధికారులు న్యాయవాది శేషాద్రిని చర్చలకు పిలిపించి అతన్ని వేధించినట్టు ఆయన పేర్కొన్నారు. దీంతో అతనికి గుండెపోటు రాగా పోలీస్ అధికారులు న్యాయవాదిని పట్టించుకోకుండా, జూనియర్ న్యాయవాదులతో ఆటోలో ఆస్పత్రికి పంపించడం బాధాకరమన్నారు. రాయలసీమలో పలు జిల్లాల్లో న్యాయవాదుల బార్ కౌన్సిల్ సభ్యులు ఆరుగురు దాకా ఉన్నారని, పోలీసుల వేధింపులతో ఓ సీనియర్ న్యాయవాది మృతి చెందితే దానిపై బార్ కౌన్సిల్ సభ్యులు స్పందించకపోవడం చాలా బాధాకరమన్నారు. న్యాయవాది మృతికి కారకులైన వారిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

3న నారావారిపల్లెలో జాబ్‌మేళా



టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పులివర్తి నానితోపాటు జిల్లా అధికారులు

తిరుపతి రూరల్ : ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్, సెర్ప్, ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, నేషనల్ కెరీర్ సర్వీస్ సహకారంతో జనవరి 3వ తేదీన నారావారిపల్లెలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. ఆదివారం ఈ మేరకు జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందని వెల్లడించారు. 20కి పైగా ప్రముఖ కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు చేపట్టనున్నట్లు వివరించారు. దాదాపు 1,200 మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం మాట్లాడుతూ అర్హులైనవారు htt pr://naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో తమ వివరాలు రిజిస్టర్ చేసుకోవాలని, అడ్మిట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకుని మేళాకు రావాలని సూచించారు. ఇతర వివరాలకు 91609 12690 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఈశ్వర్‌రెడ్డి, శ్రీధర్‌వర్మ, మధునాయుడు పాల్గొన్నారు.

ఐక్యతతో హక్కుల సాధన



మాట్లాడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నేత జగన్నాథం

తిరుపతి కల్చరల్: ఐక్యతతో హక్కులను సాధించుకుని అభివృద్ధి పథంలో పయనించేందుకు బీసీలంతా కలిసి రావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్నాథం పిలుపునిచ్చారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 50 శాతానికి పైగా జనాభా కలిగిన బీసీల హక్కుల సాధనకు మనల్ని చైతన్యం చేసేందుకు జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఇటీవల నూతన కమిటీని ఏర్పాటు చేశారని తెలిపారు. ఆ మేరకు తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో త్వరలో నూతన కమిటీలను ఏర్పాటు చేసి సంఘాన్ని బలోపేతానికి కృషి చేస్తామన్నారు. 2025 జనవరి 10న జాతీయ బీసీ సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ సభకు జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యతో పాటు రాష్ట్ర నేతలు హాజరవుతారని, బీసీలంతా హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తురక అమరనాథ్, ప్రతినిధులు లక్ష్మీప్రసన్నకుమార్, కొండా రామారావు, కిషోర్, దేవి పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణతేజ డెంటల్ కళాశాల కాన్వొకేషన్



డిగ్రీ పట్టా అందుకుంటున్న విద్యార్థిని

తిరుపతి సిటీ: తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో కృష్ణతేజ డెంటల్ కళాశాల కాన్వొకేషన్ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చదలవాడ విద్యాసంస్థల అధినేత డాక్టర్ చదలవాడ కృష్ణమూర్తి ముఖ్యఅతిథిగా విచ్చేసి బీడీఎస్ డిగ్రీ పూర్తి చేసిన 80 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రదానం చేశారు. కళాశాల క్రమశిక్షణతో పాటు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో కడప ప్రభుత్వ దంత వైద్య కళాశాల ప్రిన్సిపల్, ఓరల్ పథాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎం.జ్యోత్స్న, కృష్ణతేజ చారిటీస్ మేనేజింగ్ ట్రస్టీస్ చదలవాడ సుమలత, చదలవాడ కవిత, సభ్యులు వరుణ్ సాయి, పద్మసాహితీ, డెంటల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ శ్రీధర్, పూర్వపు ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్రనాథరెడ్డి, వివిధ శాఖల విభాగాల అధిపతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలి



మాట్లాడుతున్న ప్రజా సంకల్ప వేదిక ఉపాధ్యక్షుడు చెంగల్ రాయులు

తిరుపతి కల్చరల్: రంగంపేటలోని మోహన్ బాబు విద్యానికేతన్ కళాశాల అక్రమ నిర్మాణాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలని ప్రజా సంకల్ప వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.చెంగల్ రాయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యానికేతన్ సంస్థను అడ్డు పెట్టుకుని మోహన్‌బాబు చంద్రగిరి మండలం 4 రెవెన్యూ గ్రామాల కూడలి పరిధిలో ఉన్న వాగు, కుంటలను ఆక్రమించుకుని ప్రహరీ గోడను నిర్మిస్తున్నారని ఆరోపించారు. నాగపట్ల సర్వే నంబర్ 10/2లో వాగు పోరంబోకు భూమిలో ప్రైవేటు, విద్యానికేతన్ హాస్టళ్ల మురుగునీటి శుద్ధి కోసం ఎస్‌టీపీ ప్లాంట్‌ను తన సొంత ఖర్చులతో నిర్మిస్తానని అప్పటి జిల్లా కలెక్టర్‌ను మభ్యపెట్టి మోహన్‌బాబు అక్రమ అనుమతులు పొందారని తెలిపారు. అంతే కాక సర్వేనంబర్ 5 పుల్లయ్యగారిపల్లె వాగు పోరంబోకు భూమిని చట్ట విరుద్ధంగా కొనుగోలు చేయడమే కాకుండా అనుమతులు లేకుండా బిల్డింగ్ నిర్మాణం చేపట్టారన్నారు. దీనిపై తాను రెవెన్యూ అధికారులకు, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఈ విషయంపై తాను హైకోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. దీంతో దళితుడైన తనపై ప్రైవేటు హాస్టళ్ల వారితో కలిసి తప్పుడు ఫిర్యాదు చేసి కేసు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. వారి నుంచి తనకు రక్షణ కల్పించడంతో పాటు అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా బాలోత్సవం ముగింపు



మాట్లాడుతున్న డాక్టర్ నాగరాజు

తిరుపతి కల్చరల్: నగరంలోని నెహ్రూ మున్సిపల్ హైస్కూల్లో తిరుపతి బాలోత్సవం ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహించిన పిల్లల పండుగ పోటీలు ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. విద్యార్థుల సృజనాత్మకతకు అద్దం పట్టేలా సాగిన ఈ పోటీల్లో 163 పాఠశాలల నుంచి 8వేల మందికి పైగా విద్యార్థులు 6 వేదికలపై సుమారు 30 అంశాల్లో ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమానికి పాస్ స్వచ్ఛంద సంస్థ మురళీకృష్ణ, హెల్పింగ్ టు అదర్స్ ప్రతినిధి మణికంఠ, కోరా విజయ, రోటరీ క్లబ్ అధ్యక్షురాలు భాగ్యమ్మ, ప్రభావతి కాశయ్య, ఏనుగు అంకయ్య నాయుడు, సంకల్ప ఆస్పత్రి అధినేత డాక్టర్ నాగరాజు, చెన్నూరు సుబ్రమణ్యం అతిథులుగా హాజరయ్యారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బాలోత్సవం వ్యవస్థాపకుడు మల్లారపు నాగార్జున, గౌరవాధ్యక్షుడు టెంకాయల దామోదరం, అధ్యక్షుడు నడ్డి నారాయణ, ఉపాధ్యక్షుడు సుంకర రెడ్డెప్ప, కార్యదర్శి గురునాథం, కోశాధికారి పంచముఖేశ్వరరావు, సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోటీల్లో ప్రతిభను చాటుకుంటున్న విద్యార్థులు

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో «ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక» (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించనున్నట్లు కమిషనర్ మౌర్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ స్థానిక సమస్యలపై అర్జీలు అందించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్నమయ్య విగ్రహానికి పాలాభిషేకం



అన్నమయ్య విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న అన్నమయ్య వంశీయులు

తిరుపతి కల్చరల్: ఇటీవల ఓ గుర్తు తెలియని వ్యక్తి అన్నమయ్య విగ్రహానికి ఓ మతానికి సంబంధించిన టోపీ పెట్టడంతో వివాదాస్పదమైన నేపథ్యంలో అన్నమయ్య వంశీయులు, కళాకారులు ఆదివారం అన్నమయ్య సర్కిల్లోని అన్నమయ్య విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహానికి పూలమాలు వేసి విగ్రహం వద్ద సామూహికంగా గోవిందనామ స్మరణ చేశారు. కార్యక్రమంలో అన్నమయ్య వంశీయులు హరినారాయణ, నాగభూషణం, రాఘవ అన్నమయ్య, వారి కుటుంబీకులు, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు పాల్గొన్నారు.

నేడు శెట్టిపల్లెలో రెవెన్యూ సదస్సు

తిరుపతి అర్బన్: శెట్టిపల్లి సచివాలయం వద్ద సోమవారం రెవెన్యూ సదస్సును తహసీల్దార్ కేపీ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉండాల్సి ఉంది. ఈ క్రమంలో స్థానికులు మీ సమస్యలను రెవెన్యూ అధికారులకు తెలియజేయడానికి అవకాశం ఉంది. ప్రధానంగా రెవెన్యూ సమస్యలను చెప్పుకునే అవకాశం లభించిన నేపథ్యంలో స్థానికులు సద్వినియోగం చేసుకోవాల్సి ఉంది.

అపుస్మా రాయలసీమ జోన్ అధ్యక్షుడిగా విశ్వనాథ్‌రెడ్డి



విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ విశ్వనాథ్‌రెడ్డికి ఎన్నికల పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ

తిరుపతి ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ (అపుస్మా) రాయలసీమ జోన్ నూతన అధ్యక్షుడిగా తిరుపతి విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ విశ్వనాథ్‌రెడ్డి ఎన్నికయ్యారు. గుంటూరులోని కేఎల్ యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించిన అపుస్మా రాష్ట్రస్థాయి కమిటీ ఎన్నికల్లో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు స్కూళ్లను కలుపుకుని వారి సహకారాలతో సంఘాన్ని బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు కృషి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.